నమస్తే తెలంగాణ
సిద్ధిపేట
I హైదరాబాద్, శనివారం 17 ఆగస్టు 2024 SIDDIPET

అన్నం తినలేక పోతున్నాం

శ్రీ చైతన్య హాస్టల్ విద్యార్థుల ఆందోళన

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు16:నాణ్యమైన భోజనం అందిస్తలేరని, ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల చారుతో తినలేకపోతున్నామని విద్యార్థులు బోరున ఏడ్చిన ఘటన సిద్దిపేటలోని శ్రీ చైతన్య రెసిడెన్షియల్ పాఠశాలలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఓ విద్యార్థి కడుపు నొస్తుందనితండ్రికి ఫోన్ చేస్తే హాస్టల్‌కు వచ్చిన విద్యార్థి తండ్రికి హాస్టల్ విద్యార్థులు మొరపెట్టుకోగా ఆయన మీడియాకు సమాచారం ఇచ్చారు. అక్కడికి జర్నలిస్టులు వెళ్లగానే విద్యార్థులు ఏడుస్తూ అన్నం తినలేక పోతున్నామని, నాణ్యమైన భోజనం అందిస్తలేరని, ఉప్మా, ఇడ్లీలలో పురుగులు వస్తున్నాయన్నారు. తినలేక పస్తులుంటున్నామని, సమయానికి టీ, స్నాక్స్ ఇవ్వడం లేదన్నారు. హాస్టల్‌లో పెట్టే తిండి తినలేకపోతున్న విషయం తల్లిదండ్రులకు చెప్పుకోలేకపోతున్నామని, ధైర్యం చేసి చెప్పినా, కంప్లైంట్ చేసినా ప్రిన్సిపాల్, సిబ్బంది టార్గెట్ చేస్తున్నారని విద్యార్థులు చెప్పారు. సాక్షాత్తు విలేకరులు, తల్లిదండ్రులు ఎదుటే విద్యార్థులను ప్రిన్సిపాల్ జయ భయపెట్టే ప్రయత్నం చేశారు. లక్షల్లో ఫీజులు చెల్లించి కార్పొరేట్ పాఠశాలకు పంపితే మా పిల్లలకు అనారోగ్యాన్ని కల్పిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

సీఎం రేవంత్ రాజీనామా చేయాలి

పంట రుణమాఫీ పేరిట రైతులను మోసం చేసిన సీఎం

- హరీశ్‌రావు జోలికి వస్తే సహించేది లేదు
- పదవులను గడ్డిపోచల్లా విసిరేసే నేత హరీశ్‌రావు
- ఇకనైనా అందరికీ వందశాతం పంట రుణమాఫీ అమలు చేయాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్
- రుణమాఫీ చేయకుండా రైతుల ఉసురుపోసుకుంటున్న సీఎం
- ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

సంగారెడ్డి,ఆగస్టు 16(నమస్తేతెలంగాణ)/సంగారెడ్డి: ఏకకాలంలో ఆగస్టు 15లోపు పంట రుణాలు మాఫీ చేస్తామని చెప్పి మాటతప్పిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం సంగారెడ్డిలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, డీసీఎంఎస్‌చైర్మన్ శివకుమార్ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా రూ.31వేల కోట్ల పంటరుణాలు మాఫీ చేస్తామని చెప్పి సీఎం రేవంత్‌రెడ్డి కేవలం రూ.17వేల కోట్ల రుణమాఫీ చేసినట్లు చెప్పారు. ఏకకాలంలో రైతులందరి రుణాలు మాఫీ చేస్తానని చెప్పి రేవంత్‌రెడ్డి మాటతప్పారన్నారు. సంగారెడ్డి జిల్లాలోని రైతులకు వందశాతం రుణమాఫీ కాలేదన్నారు. మూడో విడత రుణమాఫీకి సంబంధించి రైతుల జాబితా కానీ, రైతులకు మెసేజ్‌లు కానీ రాలేదన్నారు. రుణమాఫీ చేయకుండానే రేవంత్‌రెడ్డి సీఎం కేసీఆర్, హరీశ్‌రావుల ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగస్టు 15లోగా ఎలాంటి షరతులు లేకుండా పంట రుణమాఫీతోపాటు ఆరు గ్యారెంటీలు, 13 హామీలు అమలు చేయాలని మాజీమంత్రి హరీశ్‌రావు సీఎంకు సవాల్ చేశారని గుర్తు చేశారు. ఏ ఒక్క హామీ నెరవేర్చకుండానే హరీశ్‌రావు రాజీనామా చేయమనడం విడ్డూరంగా ఉందన్నారు. పదవుల కోసం పాకులాడే బుద్ధి రేవంత్‌రెడ్డిది అన్నారు. పదవులను గడ్డిపోచల్లా విసిరేసే నేతలు కేసీఆర్, హరీశ్‌రావు అన్నారు. కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని మాట తప్పింది రేవంత్‌రెడ్డి అన్నారు. హరీశ్‌రావు జోలికి వస్తే సహించేదిలేదని సీఎంను హెచ్చరించారు. ఇకనైనా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వందశాతం పంట రుణాలు మాఫీ చేయాలని, కౌలు రైతులు, రైతు కూలీలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని, ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ..ఖమ్మం జిల్లాలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు నోరుపారేసున్నారని, సీఎం భాష మార్చుకోవాలని హితవు పలికారు. రుణమాఫీ చేయకుండా చేసినట్లు రేవంత్‌రెడ్డి గొప్పలు చెప్పుకోవటం సిగ్గుచేటన్నారు. సంగారెడ్డి జిల్లాలోని రైతులకు ఇంకా పూర్తిరుణమాఫీ కాలేదన్నారు. జహీరాబాద్ ప్రాంత రైతులు రుణమాఫీ కాలేదని తన వద్దకు వస్తున్నారని తెలిపారు. రుణమాఫీ చేసానని అబద్ధం చెబుతున్న సీఎం వెంటనే పదవికి రాజీనామా చేయాలని మాణిక్‌రావు డిమాండ్ చేశారు.

మూడో విడత రుణమాఫీ డబ్బులు రాలేదు

సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ రైతులకు వందశాతం పంట రుణమాఫీ చేయలేదని డీసీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ అన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్, హరీశ్‌రావులపై నోరుపారేసుకుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. రుణమాపీ అమలులో రేవంత్ సర్కార్ ఘోరంగా విఫలమైందన్నారు. దీనిని తాను నిరూపిస్తానంటూ శివకుమార్ విలేకరుల సమావేశం నుంచే ఝరాసంగం డీసీసీబీ బ్యాంకు మేనేజర్‌కు ఫోన్ చేసి మూడో విడత పంట రుణమాఫీ అయ్యిందా? మూడో విడత రుణమాపీ డబ్బులు పడ్డాయా? అని ప్రశ్నించారు. దీనికి మేనేజర్ సమాధానం ఇస్తూ.. సర్ ఇంకా మూడో విడత రుణమాఫీ జరిగినట్లు సమాచారం లేదని, డబ్బులు పడలేవని సమాధానం ఇచ్చారు. సమావేశంలో జైపాల్‌రెడ్డి, సంగారెడ్డి పట్టణాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, విఠల్, జలంధర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు

హరీశ్‌రావు వీడియోను ప్రదర్శించిన క్రాంతికిరణ్

సంగారెడ్డి జిల్లా వేదికగా సీఎం రేవంత్‌రెడ్డికి మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సవాలు చేసిన వీడియోను విలేకరుల సమావేశంలో మాజీఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ప్రదర్శించారు. ఎలాంటి షరతులు లేకుండా రైతుల పంట రుణమాఫీ చేయడం, ఆరు గ్యారెంటీలు, 13 హామీలు అమలు చేస్తే పదవికి రాజీనామా చేస్తానని, లేదంటే సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని హరీశ్‌రావు స్పష్టంగా సవాలు చేశారన్నారు. రేవంత్‌రెడ్డి మాత్రం వందశాతం రుణమాఫీ చేయకుండానే హరీశ్‌రావు రాజీనామా చేయమనడం సిగ్గుచేటన్నారు. సీఎం రేవంత్ రైతులను నమ్మించి గొంతు కోశారని ఆగ్రహ వ్యక్తం చేశారు. సీఎం కేవలం 46శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేశారని తెలిపారు. సంగారెడ్డి జిల్లాలోని రైతులు రుణమాఫీ కాక ఇబ్బందులు పడుతున్నారని, రోజూ బ్యాంకు చుట్టూ తిరుగుతున్నట్లు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి హరీశ్‌రావు జోలికి వస్తే సహించేదిలేదన్నారు. హామీలు అమలుచేయని రేవంత్‌రెడ్డి వెంటనే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కాసాల బుచ్చిరెడ్డి మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి హరీశ్‌రావు జోలికి వస్తే సహించమన్నారు. సంగారెడ్డి జిల్లాలో రైతులకు వందశాతం రుణమాఫీ కాలేదన్నారు. కేసీఆర్, హరీశ్‌రావులపై కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. దమ్ముంటే జగ్గారెడ్డి సంగారెడ్డి నియోజకవర్గంలోని ఏదైనా గ్రామానికి వెళ్లి వందశాతం రుణమాఫీ జరిగిందని రైతులతో చెప్పించాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ కాలేదని రైతులు చెబితే వెంటనే జగ్గారెడ్డి తన రాజకీయ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

దుబ్బాకలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి, పక్కన బీఆర్ఎస్ నాయకులు

రైతులను మోసగించిన సీఎం

- హరీశ్‌రావును విమర్శించే నైతికత కాంగ్రెస్‌కు లేదు
- ఆరు గ్యారెంటీల పేరిట ప్రజలను మోసగించిన కాంగ్రెస్
- బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి

దుబ్బాక ,ఆగస్టు 16: మోచేతికి బెల్లం పెట్టినట్లుగా రైతు రుణమాఫీ చేసి సీఎం రేవంత్‌రెడ్డి అన్నదాతలను మోసం చేశాడని బీఆర్ఎస్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి అన్నారు. శుక్రవారం దుబ్బాకలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని గొప్పలు చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విధంగా అమలు చేయలేదన్నారు. రూ.31 వేల కోట్లలో కనీసం రూ.26 వేల కోట్ల రుణమాఫీ చేయలేదన్నారు. రైతు రుణమాఫీలో సీఎం ఇచ్చిన మాటకు కట్టుబడలేదని విమర్శించారు. కాంగ్రెస్ అంటేనే మోసాలకు మారుపేరని, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా బీఆర్ఎస్‌పై పని కట్టుకొని బురదజల్లడం కాంగ్రెస్ నాయకులు మానుకోవాలని హితవు పలికారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును విమర్శించే నైతిక హక్కు సీఎం రేవంత్‌రెడ్డికి, ఆ పార్టీ నాయకులకు లేదన్నారు. సీఎం రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులను మోసగించిన సీఎంకు త్వరలోనే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు స్వామి, భూంరెడ్డి, కృష్ణ, ఖలీల్, లచ్చయ్య,యాదగిరి, రాజిరెడ్డి, రమణ పాల్గొన్నారు.

సిద్దిపేట అంబేద్కర్ సర్కిల్‌లో పెప్పర్ స్ప్రేలతో నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

నిందితులను కఠినంగా శిక్షించాలి

సిద్దిపేట, ఆగస్టు16: నిందితులను కఠినంగా శిక్షించాలని శుక్రవారం మెడికల్ విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు నిరసన చేపట్టారు. కోల్‌కతాలోని ఆర్జీకార్ మెడికల్ కాలేజీలో డ్యూటీలో ఉన్న వైద్యురాలిపై లైంగికదాడికి పాల్పడి హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ జనరల్ దవాఖాన నుంచి ముస్తాబాద్ చౌరస్తా మీదుగా పాత బస్టాండ్ వరకు నిరసన సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు ర్యాలీ చేపట్టారు. నల్ల బ్యాడ్జీలు ధరించి పాత బస్టాండ్ రోడ్డుపై బైఠాయించారు. వైద్య విద్యార్థినిపై జరిగిన పాశవిక ఘటనను ప్రదర్శన ద్వారా కళ్లకు కట్టినట్లుగా వివరించారు. మహిళలపై ఆఘాయిత్యానికి పాల్పడితే ఎలా స్పందించాలనే అంశంపై వివరిస్తూ నృత్యాల ద్వారా ప్రదర్శన చేశారు. రాఖీ పండుగ సందర్భంగా ఆక్కాచెల్లెండ్లు రాఖీ కడితే ఇచ్చే బహుమతిగా వైద్య విద్యార్థినీలకు పెప్పర్ స్ప్రే బాటిళ్లు అందజేశారు. నిరసనలో సురభి మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో నృత్య ప్రదర్శనతో ఘటనను వివరిస్తున్న జూనియర్ డాక్టర్లు, మెడికోలు

సిద్దిపేటలో సీఎం ఫ్లెక్సీకి ఫినాయిల్ పోసి వినూత్న నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో వినూత్న నిరసన

సిద్దిపేట, ఆగస్టు 16: ఎమ్మెల్యే హరీశ్‌రావుపై సీఎం వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో శుక్రవారం పాత బస్టాండ్ వద్ద వినూత్న నిరసన చేశారు. మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ పాల సాయిరాం, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి, బీఆర్ఎస్వీ నాయకులు సీఎం రేవంత్ ఫ్లెక్సీకి బ్రెష్‌తో ఫినాయిల్ పోసి నోటిని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రేవంత్ లాంటి చిల్లర మాటలు మాట్లా డే సీఎం దేశంలో మరొకరు లేరన్నారు. సీఎం మాట్లాడుతున్న భాషను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. ఆరు గ్యారెంటీలు, అనేక హామీలిచ్చి ప్రజలు, రైతులను మోసం చేసిన వ్యక్తి రేవంత్ అని అన్నారు. నిరసనలో మహిపాల్ గౌడ్, రజనీకాంత్‌రెడ్డి, సతీశ్, రమేశ్, అరవింద్‌రెడ్డి, మధు, రాజశేఖర్‌రెడ్డి, శేఖర్, నాగరాజు, కమల్‌యాదవ్, అనిల్, ఎల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలు కాంగ్రెస్‌కు చేతకాదు

సిద్దిపేట, ఆగస్టు16: ఆగస్టు 15 వరకు 6 గ్యారెంటీలు, 420 హామీలు అమలు, ఏకకాలంలో రైతు రుణమాఫీ చేయడం చేతులెత్తేసి, ఎమ్మెల్యే హరీశ్‌రావు రాజీనామా చేయాలని సీఎం రేవంత్ డిమాండ్ చేయడం ఎంతవరకు సమంజసం అని బీఆర్ఎస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..తెలంగాణలో కాంగెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హామీలు అమలు చేయకుండా మోసం పూరితంగా వ్యవహరిస్తున్నదన్నారు. నాణ్యమైన వైద్యసేవలు అందడం లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ డయాగ్నోస్టిక్ ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా అందిన వైద్య పరీక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం కుదించిందన్నారు. దీర్ఘకాలిక రోగులకు ప్రతినెలా ఉచితంగా అందించే మందులు అందడం లేదన్నారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలంగాణ ఉద్యమ నాయకుడని, సీఎం రేవంత్ పాత్ర తెలంగాణ ఉద్యమంలో జీరో అన్నారు. సమావేశంలో కౌన్సిలర్ సతీష్, నాయకులు శ్రీనివాస్,రాజు,నరసింహులు, రెబల్ రమేశ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

సిద్దిపేటలో కురుస్తున్న భారీ వర్షం

దంచికొట్టిన వాన

మెదక్ మున్సిపాలిటీ/సిద్దిపేట కలెక్టరేట్/వెల్దుర్తి/రామాయంపేట ఆగస్టు 16: మెదక్‌లో శుక్రవారం సాయంత్రం గంటన్నర పాటు భారీ వర్షం కురవడంతో డ్రైనేజీలు పొంగిపొర్లాయి. ప్రధాన రహదారులపైకి వర్షనీరు రావడంతో పాత బస్టాండ్, రాందాస్ చౌరస్తాతోపాటు జేఎన్ రోడ్డు, ఆటోనగర్ రోడ్లు జలమయమయ్యాయి. సుమారు అరగంట పాటు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. వర్షాకాలంలో ఇప్పటివరకు ఇదే అతిపెద్ద వర్షం కావడం విశేషం. మున్సిపల్ డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంతో డ్రైనేజీల నుంచి నీరు రోడ్లపైకి వచ్చి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సిద్దిపేట జిల్లాలో...

సిద్దిపేట జిల్లాలో ఎడతెరుపు లేకుండా వర్షం కురుసింది. భారీ వర్షానికి వాగులు, కుంటలు నిండాయి. ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. భారీ వర్షం కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. పంటలకు జీవంపోసినట్లు అయిందన్నారు.

వర్షం....రైతన్న హర్షం

వెల్దుర్తి, మాసాయిపేట మండలాల్లో భారీ వర్షం కురిసింది. గంటకుపైగా కురిసిన వర్షంతో దిగాలుగా ఉన్న రైతన్నల్లో సంతోషం వెల్లివిరిసింది. సాగు నీటి ఇబ్బందులతో సతమతమవుతున్న అన్నదాతలకు ఊరటనిచ్చింది. ఇప్పటికే బోరుబావుల్లో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టగా, సాగు చేసిన పంట చేతికి వస్తుందా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం కురిసిన వర్షంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. రామాయంపేట, చేగుంట, తూప్రాన్‌లోనూ వర్షం కురిసింది.

భారీ వర్షంతో మెదక్‌లో రోడ్డుపై నిలిచిన వాహనాలు

మెదక్ జిల్లా వెల్దుర్తిలో శుక్రవారం కురుస్తున్న భారీ వర్షం

గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

హరీశ్‌రావును ప్రశ్నించే అర్హత మీకు లేదు

- మిగతా 25లక్షల మంది రైతుల రుణమాఫీ చేయాలి
- రుణమాఫీ కాని రైతులతో భారీ బహిరంగ సభ
- గజ్వేల్ నుంచి కొడంగల్‌కు ఆఫీసులు తరలిస్తే ఊరుకోం
- బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఆగస్టు 16: ఏకకాలంలో రైతులకు పంట రుణాలు మాఫీ చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి మాట మార్చి కేవలం 22లక్షల మందికే రుణమాఫీ చేసి ఏదో సాధించినట్లు హరీశ్‌రావు రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం సిగ్గుచేటని, మిగతా 25 లక్షల మంది రైతుల రుణమాఫీ చేయడంలోపాటు ఆరు గ్యారెంటీలను అమలు చేస్తే తప్పకుండా హరీశ్‌రావు రాజీనామాకు సిద్ధమని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 47లక్షల మంది రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని దేవుళ్లపై ప్రమాణాలు చేసి సీఎం మాట తప్పారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 22లక్షల మందికి రూ.17 వేల కోట్ల రుణమాఫీ 47శాతం మాత్రమే చేశారని, మిగతా రైతుల ప్రతిరోజు బ్యాంకులు, తహసీల్ కార్యాలయాలు, వ్యవసాయాధికారుల వద్దకు తిరుగుతున్నారని తెలిపారు. నీతి, నిజాయి తీ లేని నాయకులు హరీశ్‌రావు రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం సిగ్గుచేటన్నారు. సీఎం ఉత్తర ప్రగాల్భాలు పలుకుతూ హామీలపై దృష్టి సారించడం లేదన్నారు. సీతారామ ప్రాజెక్టుకు రూ. 7500కోట్లు ఖర్చు చేశామని చెప్పడంలో అర్థంలేదన్నారు. కౌలు రైతులకు రూ.15వేలు ఇస్తామన్న రేవంత్‌రెడ్డి అసలు రైతులకే నేటికి ఇచ్చిన హామీల్లో ఒక్కటి దిక్కు లేదన్నారు. కాంగ్రెస్ సర్కారు రైతుభరోసా డబ్బులను రైతు రుణమాఫీకి మళ్లించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల ధరలు తగ్గడంలో గ్రామాలు, పట్టణాల్లో వ్యాపారం కుంటిపడిందని, రాష్ట్రం దివాళా తీసిందన్నారు. ఊకడంపుడు మాటలతో పబ్బం గడుపుతున్నరన్నారు. రుణమాఫీ కాని రైతులను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కలుస్తారని, త్వరలోనే గజ్వేల్‌లో భారీ బహిరంగ సభను కేసీఆర్ నాయకత్వంలో ఏర్పాలు చేస్తామన్నారు. రేపటి నుంచి గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్ర 5 వరకు రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించి రైతుల న్యాయం చేసేలా కృషి చేస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని ప్రచారం చేసిన కాంగ్రెస్ నాయకులకు పారుతున్న గోదావరి జలాలు కనిపించడం లేదన్నారు. తక్షణమే కూడవెళ్లి, హల్దీ వాగులోకి నీళ్లను వదిలి రైతులను ఆదుకోవాలన్నా రు. గజ్వేల్ నుంచి ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ ఈఈ, పంచాయతీరాజ్ ఈఈ కార్యాలయాలను కొడంగల్‌కు తరలించే ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలన్నారు. రూ.170 కోట్ల నిధులను ప్రభుత్వం వెనక్కి తీసుకెళ్లిందని, దమ్ముంటే స్థానిక కాంగ్రెస్ నాయకులు వాటిని తిరి గి తీసుకొచ్చి గజ్వేల్ అభివృద్ధికి ఖర్చుచేసేలా ప్రభుత్వంపై పోరాటం చేయాలన్నారు. ఇక్కడి కాంగ్రెస్ నేతలకు కార్యాలయాలు తరలుతున్నా కనిపించడం లేదా అని ప్రశ్నించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మండల పార్టీ అధ్యక్షుడు బెండే మధు, పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, కౌన్సిలర్లు అల్వాల బాలేశ్, అత్తెల్లి శ్రీనివాస్, నాయకులు గుంటుక రాజు, రవీందర్, నర్సింగరావు, దుర్గాప్రసాద్, స్వామిచారి, ఉమార్, మల్లేశం పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన రేవంత్

ముక్కు నేలకు రాయాలి

- రౌడీభాష మానకుంటే తీవ్ర పరిణామాలు
- నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, ఆగస్టు 16: రుణమాఫీ, రైతుభరోసా, బియ్యానికి బోనస్ విషయంలో ఎన్నికల సందర్భంగా రైతులకిచ్చిన మాటను తప్పిన సీఎం రేవంత్ అమరవీరుల స్తూపం వద్ద ముక్కు నేలకు రాసి రైతులకు క్షమాపణ చెప్పాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ధ్వజమెత్తారు. మాజీ మంత్రి హరీశ్‌రావుపై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో నారాయణఖేడ్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ప్రకిటించిన జాబితా ప్రకారం యాభైశాతం మందికి సైతం రుణమాఫీ జరగలేదని, ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా సీఎం రేవంత్ అబద్ధాలు ప్రచారం చేయడం దారుణమన్నారు. రైతుభరోసా, బియ్యానికి బోనస్ విషయంలోనూ రైతులను దగా చేసిన ప్రభుత్వం ఏ ముఖం పెట్టుకుని మాట్లాడుతున్నదని నిలదీశారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని సీతారామ ప్రాజెక్టును పూర్తి చేస్తే ప్రజలను మభ్యపెట్టేందుకు విడతల వారీగా మంత్రులు, ముఖ్యమంత్రి వెళ్లి ప్రారంభోత్సవం చేయడం వారి దిగజారుడు తనానికి నిదర్శనమని, అయినా ప్రజలకు అన్ని విషయాలు తెలుసని, సరైన సమయవంలో సరైన రీతిలో స్పందిస్తారన్నారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, మాజీ సీఎం కేసీఆర్‌ల కాలిగోటికి సరిపోని సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపెద్ద మాటలు మాట్లాడంపై ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సీఎంగా కంటే ఎక్కువ బ్లాంక్ మెయిలర్‌గా, ఓటుకు నోట్టు కేసులో నిందితుడిగానే ప్రజలకు తెలుసని, శునకాన్ని సింహాసనంపై కూర్చోబెట్టిన వెనకటి గుణం మానదన్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని ఘాటుగా విమర్శించారు. ఇప్పటికైనా రౌడీభాష మానుకుని సీఎం రేవంత్‌రెడ్డి హుందాగా ఉండాలని హితవు పలికారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు అభిశేక్ శెట్కార్, ముజామిల్, విఠల్ రావులు ఉన్నారు.

నారాయణఖేడ్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

18న రాఘవాపూర్‌కు మంత్రుల రాక

న్యాల్‌కల్, ఆగస్టు 16: ఈ నెల 18న మండలంలోని రాఘవాపూర్ గ్రామ శివారులోని సరస్వతీ దేవి పంచవటీ క్షేత్రానికి రాష్ట్ర వైద్యారోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రానున్నారు. స్థానిక పంచవటీ క్షేత్ర ఆవరణలో నిర్మించిన కాశీనాథ్‌బాబా మల్టీ స్పెషాలటీ దవాఖానను మంత్రి ప్రారంభించనున్నట్లు క్షేత్ర పీఠాధిపతి కాశీనాథ్‌బాబా తెలిపారు. కార్యక్రమానికి కర్ణాటక రాష్ట్ర అటవీశాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే, కలెక్టర్ వల్లూరు క్రాంతి, జహీరాబాద్ ఎంపీ సురేశ్‌కుమార్ షెట్కార్, జహీరాబాద్, నారాయణఖేడ్, నర్సాపూర్, సంగారెడ్డి ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, సంజీవ్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, చింతాప్రభాకర్‌తోపాటు పలువురు పీఠాధిపతులు, ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ ప్రాంత ప్రజలకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలను అందించాలనే ఉద్దేశంతో మల్టీ స్పెషాలటీ దవాఖాన ఏర్పాటు చేసినట్లు కాశీనాథ్‌బాబా తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, ప్రజలు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

బస్సు కోసం రోడ్డెక్కిన విద్యార్థులు



చిలిపిచెడ్‌లో నర్సాపూర్-జోగిపేట ప్రధాన రోడ్డుపై ధర్నా చేస్తున్న విద్యార్థులు

చిలిపిచెడ్, ఆగస్టు 16: సమయానికి పల్లెవెలుగు బస్సు నడపడంలేదని చిలిపిచెడ్‌లో శుక్రవారం అందోల్-జోగిపేట ప్రధాన రోడ్డుపై విద్యార్థులు రోడ్డెక్కారు. సీఎం రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలతో ధర్నా చేశారు. చిలిపిచెడ్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజ్ లేకపోవడంతో మండ